క్లుప్తంగా

గ్రామసమాఖ్య పనితీరుపై ట్రెయినీ కలెక్టర్ ఆరా


సభ్యులతో మాట్లాడుతున్న సౌరభ్‌శర్మ

సుజాతనగర్: మండలంలోని వెంకటేశ్వర గ్రామ సమాఖ్య పనితీరును ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ గురువారం పరిశీలించారు. నాయకులగూడెం గ్రామంలో గ్రూపు సభ్యులతో సమావేశమైన ఆయన రుణాలు, నెలవారీ చెల్లింపులు, సమావేశాల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే, రుణాల సాయంతో ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారని తెలుసుకున్నారు. ఏపీఎం రాంబాబు, సీసీ శిరీష పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును గాంధీపథం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కన్వీనర్ సీహెచ్ గేర్షోమ్ మాట్లాడుతూ సీపీఐ కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన కూనంనేని పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచి అనేక భూపోరాటాలు, కార్మిక ఉద్యమాలు, రైతాంగ పోరాటాలలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీ.నర్సయ్య, కళావతి, రఘుపతి, సమున్ పాల్గొన్నారు.

పాల్వంచ విద్యార్థికి అవార్డు

పాల్వంచ: తిరుపతిలో ఇటీవల సిటిజన్ ఆఫ్ వెల్ఫేర్ అండ్ ఇండియా కల్చరల్ ఆధ్వర్యాన నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్వంచకు చెందిన నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఉప్పుశెట్టి ఆకాంక్ష ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా తాళ్లపాక హరిహర నారాయణాచార్యులు చేతుల మీదుగా నంది అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆకాంక్షను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జై సంతోషిమాత నాట్యనిలయం గురువు టి.వరలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, నవభారత్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్‌వీకే.ప్రసాద్ తదితరులు గురువారం అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి..

ఇల్లెందు: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ స్కీమ్ వర్కర్లందరినీ పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ ఉపాధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో జరిగిన ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ, ఈసీఎల్, బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, గ్రామపంచాయతీ, మున్సిపల్, హాస్పిటల్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసే కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులతోపాటు స్కీం వర్కర్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీస వేతనాలు లేక, ఉద్యోగభద్రత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు సదస్సుకు కార్మిక వర్గంను తరలించాలని కోరారు. రావూరి ఉపేందర్‌రావు, సారంగపాణి, జే.సీ తారాయ్య, రాసుద్దీన్, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

‘బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోంది..’

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో 42శాతం రిజర్వేషన్లు పెంచకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని జైభీమ్‌రావు భారత్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించి ఐదు నెలలు అవుతున్నా నేటి వరకు ఆమోదించకుండా అడుగడుగునా అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, పగవాల సునీల్ కుమార్, పూణెం మురళీ, నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


ఇల్లెందు: ఆర్యవైశ్య సత్రంలో..


కొత్తగూడెంటౌన్: రామవరం ఎస్‌సీబీ నగర్‌లో..


టేకులపల్లి కుప్పస్వామి కాలనీలో..



వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణం, పల్లెల్లో గణేష్ విగ్రహాలు కొలువుదీరాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపాలు, చలువ పందిళ్లు, ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలకరించి ముస్తాబు చేసి గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. భారీ వర్షంలోనూ స్థానికులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రెండో రోజు వినాయకుడికి ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందురూరల్: తిలక్‌నగర్‌లో విఘ్నేశ్వరుడిని పూజిస్తున్న మహిళలు


టేకులపల్లి సెంటర్‌లో నందినీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో 158 కేజీల లడ్డూతో దాతలు


కొత్తగూడెంటౌన్: లేపాక్షి హోటల్ సమీపంలోని మండపంలో పూజలు చేస్తున్న భక్తులు


కాకర్ల కాలనీ (జూలూరుపాడు)లో..


సూపర్‌బజార్(కొత్తగూడెం): మధురబస్తీలో భక్తులకు అన్నదానం

ఏరియాలో టీబీజీకేఎస్ ఆందోళన, నిరసన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని జీకే ఓసీ, వీకే–7, పీవీకే – 5 ఇంక్‌లైన్, ఆర్‌సీహెచ్‌పీ తదితర విభాగాలలో టీబీజీకేఎస్ నాయకులు నల్లబ్యాడ్జిలతో గురువారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గనుల హెచ్‌ఓడీలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నిర్వాకం వలన కార్మికుల సమస్యలు పెరిగిపోతున్న తరుణంలో సమస్యల సాధనకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను వివరించారు. వాటిలో..

- ట్రాన్స్‌ఫర్ కొత్త పాలసీని రద్దు చేయాలని, ట్రాన్స్‌ఫర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలి
- వాస్తవ లాభాలపై కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలి.
- కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని, అలవెన్స్‌లపై ఆదాయపు పన్నును యాజమాన్యమే కోలిండియా మాదిరిగా చెల్లించాలని కోరారు.
- అనారోగ్య సమస్యలపై మెడికల్ బోర్డ్‌కు వెళ్తున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని, 24 సంవత్సరాల కాలపరిమితిని 36 నెలలకు పెంచాలని విన్నవించారు.
- జూలైలో నిర్వహించిన మెడికల్ బోర్డ్‌ను తిరిగి నియమించి వారందరిని అన్‌ఫిట్ చేయాలి.
- వేలంపాటతో సంబంధం లేకుండా సింగరేణికి నూతన గనులు కేటాయించాలని పేర్కొన్నారు.
- మెడికల్ ట్రెనింగ్ పూర్తయిన డిపెండెంట్లకు నియామకపత్రాలు అందజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రసిడెంట్ గడప రాజయ్య, సెంట్రల్ కమిటీ సభ్యులు ఈశ్వర్, అశోక్, రాజ్‌కుమార్, గణేష్, సాగర్, వెంకటే శ్వర్లు, రామ్మూర్తి, రాజేశ్వరరావు, రవీందర్, ప్రబాకర్, రఫీ, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

‘గుర్తింపు సంఘం నిర్లక్ష్యంతో కార్మికులకు నష్టం’

సింగరేణి(కొత్తగూడెం): గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నిర్లక్ష్యం కారణంగా టెక్నికల్ ఏ గ్రేడ్ కార్మికుడికి సగటున రూ.15,688 నష్టం వాటిల్లుతోందని ఏబీకేఎంఎస్ జాతీయ నాయకుడు మాధవ నాయక్ పేర్కొన్నారు. గురువారం బీఎంఎస్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం మే 2024 నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ కార్మికులకు ఆర్థికంగా నష్టమే వచ్చిందన్నారు. కన్వెన్షన్ అలవెన్స్ రూ.1,950 నుంచి రూ.2,593.50, బంగ్లా మెయింటనెన్స్ అలవెన్స్ రూ.1,219 నుంచి రూ.1,621.60 పెరిగాయని, ఈ రెండు కలిపి ఒక్కో కార్మికుడికి నెలవారీగా రూ.1,045.90 పెరుగుదల రావాల్సి ఉంది. అయితే గుర్తింపు సంఘం నిర్లక్ష్యం కారణంగా ఈ పెంపు మే 2024 నుంచి ఆగస్టు 2025 వరకు (15 నెలలు) అమలు కాకపోవటం వల్ల ఒక్కో టెక్నికల్ అండ్ సూపర్‌వైజర్ క్యాడర్ ఏ గ్రేడ్ కార్మికుడు సగటున రూ.15,688 నష్టపోయారని గుర్తింపు సంఘం నాయకులు గమనించాలన్నారు.

ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, బి.రామ్‌సింగ్, జీవీ కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, ఎం. శ్రీనివాస్, ఠాగూర్, కాసర్ల మోహన్, ఇనుపనూరి నాగేశ్వర రావు, ధరావత్ నాగేశ్వరరావు, రాజేష్, చంద్రశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శన


టేకులపల్లి: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

జూలూరుపాడు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం గ్రామ పంచాయతీ ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా నోటీస్ బోర్డులపై ప్రదర్శించారు. జూలూరుపాడు ఎంపీడీఓ తాళ్లూరి రవి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ తేదీ లోపు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తోగ్గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఓటర్ ముసాయిదా జాబితాను ఓటర్లకు అందుబాటులో ఉంచినట్లు కార్యదర్శి రవికుమార్ తెలిపారు.

ఇల్లెందురూరల్: మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులు గురువారం ప్రదర్శించారు.

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. గురువారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద నోటీసు బోర్డుపై జాబితాను ప్రదర్శించారు. ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో తనిఖీ


వైద్యసిబ్బందితో డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: పాత కొత్తగూడెంలోని యూపీహెచ్‌సీలో గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ల్యాబరేటరీలో చేస్తున్న పరీక్షలు, గర్భిణుల నమోదు, సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గర్భిణీకి సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని, అర్హులైన పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వలన్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్న వారికి క్రమం తప్పకుండా మందులు అందించాలని, 30 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరికి ఎన్సీడీ స్క్రీనింగ్ నిర్వహించాలని, మానసిక రుగ్మతలతో బాధపడే వారి కోసం టెలిమానస్ సేవలు ఉపయోగించాలని చెప్పారు. వయోవృద్ధుల కోసం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో పాలియేటివ్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయని, క్యాన్సర్ కేసులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఉపయోగించుకోవాలని తెలియజేశారు. పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ, డ్రగ్స్ స్టోర్ మరమ్మత్తుల గురించి అంచనాలు తయారు చేసి పంపించాలని డాక్టర్ రాకేష్‌ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రాంప్రసాద్, ఫార్మసిస్ట్ సౌమ్య నర్సింగ్ ఆఫీసర్ జయంతి, ఎల్‌టీ నాగమణి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి

ఇల్లెందు: జిల్లాలో పలు నియోజకవర్గాలకు సాగునీరు అందక, గోదావరి నీరు రాక పొలాలు ఎడారిగా మారుతున్నాయని గిరిజనులు పోడుకే పరిమితం అవుతున్నారని అయినా జిల్లాకు చెందిన ఆదివాసీ ఎమ్మెల్యేలు నోరు మెదపటం లేదని సీపీఎం గిరిజన సంఘం జిల్లా నాయకుడు వజ్జా సురేష్ ఆరోపించారు. గురువారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గిరిజనుల సాగు భూములు వర్షాధారంపై ఆధారపడి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కలిసి కట్టుగా సీఎం వద్దకు వెళ్లి గోదావరి జలాలను జిల్లాలోని బీడు భూములకు అందించేలా డిజైన్ చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూతి రాజశేఖర్, కొడెం బోస్, తాటి భవానీ, మహేశ్వరీ, రాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహదారులపై గుంతలు పూడ్చివేత


పరిశీలిస్తున్న కమిషనర్ సుజాత

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ డివిజన్ పరిధి దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాసకాలనీ వరకు రహదారిపై ఇటీవల వర్షాలతో పలుచోట్ల గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతుండగా కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. ఈ మేరకు గురువారం వెట్‌మిక్స్ తెప్పించి సిబ్బందితో గుంతలు పూడ్చించారు.

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం


కొత్తగూడెంఅర్బన్: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


టేకులపల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీదార్లకు వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు మోదీ సర్కార్ యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యదస్రు, కొమారి హనుమంతరావు, దీటి లక్ష్మీపతి, జక్కుల రాములు, దారా శ్రీనివాస్, నూనావత్ గోవిందు, గుత్తుల శ్రీనివాస్, షాహీన్, నీడాల సుధాకర్, రాంజీ, కోడి లింగయ్య, జలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్రంలోని మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైందని సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం సమర్పించారు. లక్ష్మీపతి, దారా శ్రీనివాస్, నునావత్ గోవింద్, సాపవత్ రవి, లింగయ్య, రాంబాబు, రాంప్రసాద్, మాధవరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: రైతులకు యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు గుగులోత్ రామ్ చందర్‌నాయక్ కోరారు. ఈ మేరకు సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం పిలుపు మేరకు గురువారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అయిత శ్రీరాములు, గుగులోతు శ్రీను, తేజావత్ మధు, జినుక వెంకన్న, తేజావత్ శ్యాంబాబు, సమ్మయ్య, లక్ష్మణ్, నరేందర్, గుగులోతు సోని, జోగా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: రైతులకు యూరియా సరఫరాలో కేంద్రం విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం విమర్శించారు. సంఘం ఆధ్వర్యాన గురువారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ దారా ప్రసాద్‌కు అందజేశారు. మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంపై ప్రధానమంత్రి సవితి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తమ అనుకూల రాష్ట్రాలకు యూరియా సరఫరా చేసి తెలంగాణకు అన్యాయం చేయడం గర్హనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని రాష్ట్రానికి రావాల్సిన పది లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, శనిగారపు శ్రీనివాసరావు, వైఎస్.గిరి, డి.చెన్నయ్య, కొంగర అప్పారావు, రంజిత్, సత్యనారాయణ, జర్పుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: రైతులకు సరిపడా యూరియా అందించాలని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి పాపారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతులకు ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో కొమారి హనుమంతరావు, తాళ్లూరి ధర్మారావు, మదన్‌సింగ్, గోపి చౌహన్, వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు


టేకులపల్లి: పుణ్యపు వాగు ప్రవాహం

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు మత్తడి పోశాయి. పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి స్థానికులను అప్రమత్తం చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద చేరింది. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందురూరల్: ఉధృతంగా మస్సివాగు


పాల్వంచరూరల్: మల్లారం వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వరద


జూలూరుపాడు: పడమటనర్సాపురం వద్ద తుమ్మలవాగును పరిశీలిస్తున్న వైరా ఎమ్మెల్యే


వాగును పరిశీలిస్తున్న సీఐ శ్రీలక్ష్మి, ఎస్‌ఐ రవి

కాంట్రాక్ట్ కార్మికులకూ ఈఎస్‌ఐ సేవలు

- త్వరలోనే సింగరేణిలో అమలు
- విధివిధానాలు రూపొందిస్తున్న యాజమాన్యం


ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రతిపాదించిన రామవరంలోని పాత ఆస్పత్రి భవనం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్‌ఐ వైద్య సేవల అమలుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈఎస్‌ఐ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఎస్‌ఐ తక్షణమే అమలు చేసేలా కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా సూచనలు చేశారు.

రూ.21 వేల లోపు పొందేవారు అర్హులు..

1948 ఈఎస్‌ఐ చట్టం ప్రకారం నెలకు రూ.21వేల లోపు వేతనం పొందేవారు ఈఎస్‌ఐ సేవలకు అర్హత ఉంటుంది. సింగరేణి వ్యాప్తంగా ఈ విధానం అమలు చేయాలని నిర్ణయించగా.. తొలుత కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాలో ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఏవైనా లోటుపాట్లు ఎదురైతే సవరించి సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాలకు విస్తరించనున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు మేలు...


కొన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర, పలు పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులకు ఈఎస్‌ఐ సేవలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఈఎస్‌ఐ సేవలతో ఉపయోగాలపై ప్రచారం లేని కారణంగా సింగరేణిలో అమలు కాలేదు. ఇటీవల కాంట్రాక్ట్ పరిరక్షణ సంఘం ఆధ్వర్యాన చేసిన కృషితో ముందడుగు పడింది. ఈ విధానం అమల్లోకి వస్తే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకే కాక వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సదుపాయాలతోపాటు ప్రమాద నష్టపరిహారం, బీమా అందుతాయి.

వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి...



కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబీకుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి. అలాగే, ఈఎస్‌ఐ ఉపయోగాలపై వారికి అవగాహన పెంచాలి. అలాగే, కార్మికుల వేతనం, వ్యాధుల వివరాలను పంపిస్తే వైద్యసేవలు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తాం. – సాయికిరణ్, ఈఎస్‌ఐ వరంగల్, హైదరాబాద్ రీజియన్ అధికారి

పైలట్ ప్రాజెక్ట్ కొత్తగూడెంలో...



కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించేలా ఈ స్కీమ్ అమలు చేస్తాం. పైలట్ ప్రాజెక్ట్‌గా కొత్తగూడెంలో అమల్లోకి వస్తుంది. ముందుగా ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెంలో కార్మికులకు వర్తించాక సంస్థ వ్యాప్తంగా విస్తరిస్తాం. – కవితానాయుడు, జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)

ఈ నిర్ణయం కార్మికులకు వరం..



కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు చాలీచాలని జీతంతో ఇబ్బంది పడుతున్నారు. అనుకోని ఆపద ఎదురైతే చికిత్స చేయించుకోలేక అవస్థ ఎదుర్కొంటున్నారు. ఈక్రమాన కార్మికుల కోసం కంపెనీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం, హర్షణీయం. – సంజీవ్, ఐఎఫ్‌టీయూ రీజియన్ కార్యదర్శి